ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 21-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశ భాషా వైవిధ్యం ఐక్యతకు మూలమని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ❖ భారతదేశం-బ్రెజిల్ సంబంధాలు మరింతగా బలపడ్డాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు.
- ❖ నక్సలిజాన్ని దేశం నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తిగా నిర్మూలించనున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం-బ్రెజిల్ సంబంధాలు మరింతగా బలపడ్డాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రక్షణ రంగంలో సహకారం కూడా ఇరు దేశాల మధ్య పెరుగుతోందని తెలిపారు. లాటిన్ అమెరికాలో బ్రెజిల్ భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని నరేంద్ర మోదీ పేర్కొంటూ…

(వాయిస్ 34 సెకన్లు)

అంతకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వాతో సమావేశమయ్యారు. వాణిజ్యం, ఇంధనం, రక్షణ, వ్యవసాయం, వాతావరణ చర్య, సాంకేతికత, AI, సెమీకండక్టర్లు, కీలకమైన ఖనిజాలు, గ్లోబల్ సౌత్ సహకారం వంటి అంశాలలో భారతదేశం - బ్రెజిల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై ఇరువురు నేతల మధ్య చర్చలు జరిగాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఐక్య రాజ్యసమితిలో ముఖ్యంగా భద్రతా మండలిలో తక్షణ

సంస్కరణలకు కూడా వారు పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై ప్రపంచ పోరాటాన్ని బలోపేతం చేయడానికి ఇద్దరు నాయకులు తమ నిబద్ధతను తెలియజేశారని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ భాషా వైవిధ్యం ఐక్యతకు మూలమని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్  పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో గుజరాతీ, తమిళ భాషలలో రాజ్యాంగాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారత రాజ్యాంగం స్థానిక భాషల ద్వారా ప్రజలకు  చేరినప్పుడు మరింతగా అవగాహన చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. స్థానిక భాషలలో రాజ్యాంగాన్ని అందుబాటులో ఉంచడం వల్ల ప్రజలు  తమ హక్కులు, విధులు, బాధ్యతలను అర్థం చేసుకోగలుగుతారని ఉప రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో గత కొన్ని రోజులుగా జరిగిన ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ ఈరోజుతో ముగిసింది. ఈ సమ్మిట్ కు వందకు పైగా దేశాల నుండి ప్రతినిధులు, ఆవిష్కర్తలు, పరిశ్రమల అధిపతులు, వివిధ రంగాలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వీరిలో ప్రపంచ సాంకేతిక నాయకులు, స్టార్టప్ ప్రతినిధులు సైతం ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి నుండి అద్భుతమైన స్పందన లభించింది. 5 లక్షలకు పైగా సందర్శకులు ప్రదర్శనకు హాజరయ్యారు. అలాగే చర్చలలో పాల్గొన్నారు, ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ నిర్వహణ ద్వారా భారత్ బాధ్యతాయుతమైన సాంకేతిక అభివృద్ధికి కీలకమైన కేంద్రంగా ఆవిర్భవించినట్లు అయింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో జరిగిన ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్-2026 పూర్తిగా విజయవంతం అయిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సమ్మిట్ వేదికను ఈ రోజు సందర్శించిన ఆయన AI సమ్మిట్ యువతలో ఎంతో ఉత్సాహం నింపిందన్నారు. కొత్త ఆవిష్కరణాలతో వివిధ సాంకేతిక పరిష్కారాలను కూడా ఈ సమ్మిట్ అందించిందని కేంద్రమంత్రి చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నక్సలిజాన్ని దేశం నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తిగా నిర్మూలించనున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. గౌహతిలో ఈ రోజు జరిగిన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF) 87వ వ్యవస్థాపక దినోత్సవ కవాతులో సిబ్బందిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. CRPF దేశానికి అసమానమైన సేవ చేసిందని ఈ సందర్భంగా హోం మంత్రి కొనియాడారు. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చడంలో CRPF కోబ్రా బెటాలియన్లు

విశేషమైన పాత్ర నిర్వహిస్తున్నాయని అన్నారు. ఈశాన్య ప్రాంతం, జమ్మూ కాశ్మీర్ తో పాటుగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో శాంతిని పునరుద్ధరించడంలో CRPF ముఖ్యమైన భూమిక పోషించిందన్నారు. CRPF లేకుండా దేశ అంతర్గత భద్రతను ఊహించలేమని చెప్పారు. దేశ సేవలో 2 వేల 270 మంది సిబ్బంది తమ ప్రాణాలను అర్పించారని, అలాగే 700 మంది సిబ్బంది ఈశాన్య ప్రాంతంలోనే తమ ప్రాణాలను త్యాగం చేశారని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి కవాతును సమీక్షించి గౌరవ వందనం స్వీకరించారు. CRPF సిబ్బంది అసాధారణ ధైర్యసాహసాలకు గుర్తింపుగా వారికి ధైర్య పతకాలను కూడా ప్రదానం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం సాంకేతిక రంగంలో స్వావలంబన దిశగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ -జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్ - ఇండియా చిప్ ప్రైవేట్ లిమిటెడ్ - కు ప్రధానమంత్రి ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధానమంత్రి.. ఉత్తరప్రదేశ్‌లో సెమీకండక్టర్ సౌకర్యం ఏర్పాటు అన్నది సాంకేతిక స్వావలంబన దిశగా కీలకమైన అడుగుగా పేర్కొన్నారు. ఇది ప్రపంచ చిప్ పర్యావరణ వ్యవస్థలో భారతదేశం ఉనికిని చాటుతుందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... గత 11 సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా మార్చిందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వాణిజ్యం 95 శాతం పైగా సముద్ర మార్గాల ద్వారా సాగుతోందని నావికాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి పేర్కొన్నారు. గోవా మారిటైమ్ కాన్ క్లేవ్ ఐదవ ఎడిషన్‌ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశాల మధ్య సముద్ర సహకారం చాలా అవసరమన్నారు. దీని వల్ల ఉమ్మడిగా సవాళ్ళను ఎదుర్కోగలమని చెప్పారు. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలన్ కార్యక్రమాలు దేశాల మధ్య సమిష్టి భాగస్వామ్యాన్ని చాటి చెప్పాయని గుర్తు చేశారు. 74 దేశాల ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమాలు సముద్ర రంగానికి సంబంధించి పెరుగుతున్న అవసరాలను తెలియచేస్తున్నాయన్నారు. 14 హిందూ మహాసముద్ర తీర ప్రాంత దేశాలను ఒక వేదిక మీదకు చేర్చి నిర్వహించిన అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ఒక అర్థవంతమైన కేంద్రీకృత వేదికగా అడ్మిరల్ త్రిపాఠి అభివర్ణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) అన్నది దేశ పురోగతికి కేంద్ర బిందువుగా మారిందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన జాతీయ CSR సమ్మిట్ 2026లో ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ... ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, సమాజ అవసరాలకు అనుగుణంగా CSR ముఖ్య పాత్ర పోషిస్తోందని తెలిపారు. గత దశాబ్ద కాలంలో భారతదేశం చేపట్టిన నిర్మాణాత్మక సంస్కరణలు, వేగవంతమైన మౌలిక సదుపాయాల విస్తరణ, డిజిటల్ కనెక్టివిటీ వంటి వాటితో కోట్లాది మంది పేదరికం నుండి బయటకు రాగలిగారని రాధాకృష్ణన్ గుర్తు చేశారు. సగటు ఆర్థిక వ్యవస్థ నుండి ప్రపంచ వ్యాప్తంగా నాలుగవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారడానికి స్థిరమైన అభివృద్ధి దోహదపడిందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =